క్లుప్తంగా

నేటి నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపు

సీతానగరం: బొబ్బిల్లంక సచివాలయ-1లో ఆధార్ స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ ఎం.భారతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆధార్ స్పెషల్ క్యాంపు ఈనెల 23వ తేదీ వరకూ జరుగుతుందన్నారు. 5 ఏళ్ల నుంచి 15 ఏళ్ల వయస్సు గల పిల్లలకు మాత్రమే ఈ స్పెషల్ క్యాంపు జరుగుతుందని, ఆధార్ కార్డులో తప్పులు ఉన్నా, అడ్రస్సులు మార్పు వంటి పలు అంశాల మార్పుల కోసం స్పెషల్ క్యాంపు నిర్వహిస్తున్నట్టు తెలిపారు.

త్రిముఖలింగేశ్వరునికి పూజలు

బిక్కవోలు: కొంకుదురు బుడిత మామిడి వద్ద కొలువైన ఉన్న బాలత్రిపుర సుందరి సమేత త్రిముఖలింగేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. శ్రావణ మాసం సోమవారం సందర్భంగా ఆలయం జరిగిన పూజల్లో భక్తులు విశేషంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయం కమిటీ ఆధ్వర్యంలో అన్న సమారాధన జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ వెంకటరామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అభిరామ్‌కు ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు



సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్‌ను పొందిన ఫొటో ఇదే..

రాజానగరం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో కొత్తతుంగపాడుకు చెందిన ఫొటోగ్రాఫర్ గొల్లపల్లి అభిరామ్‌కు ఉత్తమ ఫొటోగ్రఫీ అవార్డు(సర్టిఫికెట్ ఆఫ్ మెరిట్) లభించింది. డాక్టర్ ఎన్.భగవాన్‌దాస్, బండి రాజన్‌బాబుల స్మారకార్థం ఫొటో జెనిక్ ఆర్ట్స్ సర్కిల్ ఏపీ ఫొటోగ్రఫీ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో సబ్జెక్ట్, కంపోసిషన్, టెక్నికల్, లైటింగ్ అంశాలు ప్రాతిపదికన విజేతలను ఎంపిక చేసి, ప్రశంసా పత్రంతోపాటు బహుమతులు అందజేశారు.

గైట్ వలంటీర్లకు ఉత్తమ సేవా అవార్డు


వలంటీర్లను అభినందిస్తున్న సిబ్బంది

రాజానగరం: ఆంధ్రా యూనివర్సిటీ నుంచి గైట్ స్కూల్ ఆఫ్ ఫార్మసీ ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పి.సుచిత్ర, ఎ.యతీష్‌లకు ఉత్తమ సేవా పురస్కారాలు అందుకున్నారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండీ ధనరాజ్ తెలిపారు. సోమవారం మీడియాతో మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవ సంబరాలలో భాగంగా ఈ పురస్కారాలు పొందరన్నారు. ఈ సందర్భంగా వలంటీర్లను అభినందించారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు


టీజీఆర్ కన్వెషన్‌లో విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

అనపర్తి: మాతృ భూమిపై మమకారంతో తండ్రి పేరుతో తేతల గోవిందరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న తేతల సుధాకరరెడ్డి సేవలు అభినందనీయమని కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు కర్రి త్రినాథ్‌రెడ్డి ప్రశంసించారు. ప్రముఖ వ్యాపారవేత్త స్వర్గీయ తేతల గోవింద్‌రెడ్డి జయంతిని పురస్కరించుకుని టీజీఆర్ కన్వెషన్ హాల్లో సోమవారం తేతల గోవింద్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యా ప్రోత్సాహక ప్రతిభా పురస్కారాలు, నగదు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధి ఎస్వీఆర్ వ్యాపార సంస్థల అధినేత సబ్బెళ్ల సత్యనారాయణరెడ్డి, కోస్తాంధ్ర రెడ్డి సంక్షేమ సంఘం యువజన విభాగం అధ్యక్షుడు తాడి చంద్రశేఖర్ రెడ్డి, ట్రస్ట్ నిర్వాహకులు తాడి మూలారెడ్డి, తాడి వెంకటరెడ్డి, మల్లిడి ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

90 లీటర్ల సారా స్వాధీనం

సీతానగరం: మండలంలోని ఇనుగంటివారిపేట ఏటిగట్టుపై 90 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, వీరెల్లి రాముపై కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చుతామన్నారు.

పాఠశాల నూతన భవనం ప్రారంభం

సీతానగరం: మునికూడలి ఎంపీయూపీ పాఠశాల నూతన భవనాన్ని రుడు చైర్మన్ బొడ్డు వెంకటరమణచౌదరి, జనసేన నాయకురాలు బత్తుల వెంకటలక్ష్మి చేతుల మీదుగా సోమవారం ప్రారంభించారు. మునికూడలి ప్రభుత్వ పాఠశాలకు రూ.18 లక్షలతో ప్రహరీ, నిలిచిన భవన పనులను పూర్తి చేసి విద్యార్థులకు హైదరాబాద్‌లో ఉంటున్న ప్రముఖ వ్యాపారవేత్త బొల్లి సత్యనారాయణ, బీజేపీ నియోజకవర్గం ఇన్‌చార్జి నీరుకొండ వీరన్న చౌదరి అందించారు.

ఉపాధికి ఊతం

- ఉపాధి హామీ పథకంలో కొత్త పనులు
- పండ్ల తోటలు, నీటి కుంటలు, కందకాల తవ్వడానికి ప్రాధాన్యం
- ఆసక్తి ఉన్న రైతుల నుంచి దరఖాస్తుల స్వీకరణ
- అన్నదాతలకు అండగా కేంద్ర ప్రభుత్వం


రంగంపేట మండలంలో భూగర్భ జలాలు పెంపునకు తవ్విన కందకాలు (ఫారమ్ పాండ్)


ఉపాధి హామీ పథకంలో తవ్విన ఫారం పాండ్‌లో చేరిన నీరు


జీడిమామిడి తోటల్లో మొక్కల చుట్టూ రింగ్ ట్రెంచర్లు తవ్వుతున్న వేతనదారులు

రంగంపేట: అన్నదాతలకు కేంద్ర ప్రభుత్వం వెన్నుదన్నుగా నిలుస్తోంది. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా శాశ్వత ఫలసాయం దక్కేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. ఇప్పటికే ఉపాధి హామీ పనులకు మంచి ఆదరణ ఉండగా రైతన్నల నుంచి దరఖాస్తులు స్వీకరించి సరికొత్త పనులకు శ్రీకారం చుడుతోంది. పచ్చదనమే ప్రధానంగా ఉపాధి హామీ సిబ్బందికి శిక్షణ ఇచ్చి క్షేత్ర స్థాయిలో రైతులకు సహాయం అందించేలా ప్రణాళిక సిద్ధం చేసింది. అటు రైతులకు, ఇటు వేతనదారులకు నిత్యం లబ్ధి చేకూరేలా పండ్ల తోటల పెంపకం చేపట్టి తద్వారా రైతులకు ఆర్థిక సహాయం అందించేలా కార్యాచరణ రూపొందించింది. కందకాలు తవ్వడం వలన భూగర్భ జలాలు సైతం పెరగనున్నాయి.

మొక్కల పెంపకంతో అదనపు ఆదాయం

పొలాల గట్లపై మొక్కల పెంపకం, చెట్ల చుట్టూ కందకాల (రింగ్ ట్రెంచ్‌లు) తవ్వించడం వంటి పనులకు ఉపాధి పథకం ద్వారా నిధులు చెల్లిస్తున్నారు. ఈ పనుల ద్వారా రైతులకు అటు పొలాల వద్ద చెట్లను సంరక్షించుకునే అవకాశంతో పాటు రూ.17 వేల వరకు వేతనం లభిస్తుంది. మరో వైపు ఈ కందకాలతో చెట్టుకు నీటి సదుపాయం కలుగుతుంది. మూడు ఎకరాలున్న రైతులు తమ మెట్ట ప్రాంత పొలాల్లో నీటి కుంటలు తవ్వుకునేందుకు నిధులు కేటాయిస్తున్నారు. 9 మీటర్ల వెడల్పు, 9 మీటర్ల పొడవుతో పాటు రెండు మీటర్ల లోతు తప్పని సరిగా తవ్వాలి. వీటికి రూ.50 వేలు వరకు అందజేస్తారు.

తోటల పెంపకానికి ప్రోత్సహకాలు

న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా రైతుల తమ పొలాల్లో పండ్ల తోటల పెంపకం చేపడితే ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందజేస్తారు. ఉద్యానవన అధికారులతో 14 రకాల పండ్ల మొక్కలను రైతులకు ఉచితంగా ఇస్తారు. ఆసక్తి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఎకరాకు 60 నుంచి 70 వరకు మొక్కలు అందిస్తారు. వీటిని మూడేళ్ల పాటు పెంపకానికి రూ.97 వేలు వరకు ఉపాధి పథకం ద్వారా పనులు అందిస్తారు. మూడేళ్ల అనంతరం ఫలసాయాన్ని రైతులే పొందవచ్చు.

రైతులకు ఉపయోగం


జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల ద్వారా కొబ్బరి, ఆయిల్‌పామ్ మొక్కల పెంపకానికి ఉపాధి హామీ వేతన దారులతో కందకాలు తవ్వించడం రైతులకు ఉపయోగకరంగా ఉంటుంది. మొక్కల ఎదుగుదలకు మూడేళ్ల పాటు సంరక్షణ కల్పిస్తూ ప్రోత్సాహకాలు ఇవ్వడం సంతోషంగా ఉంది.

– పేపకాయల రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు, రంగంపేట మండలం

పెరగనున్న భూగర్భ జలాలు


రైతులకు, వేతన దారులకు ఈ పథకం ఎంతో ఉపయోగకరం. అలాగే భూగర్భ జలాలు పెరగడానికి దోహదపడతాయి. కందకాల తవ్వకానికి నిధులు కేటాయిస్తున్నాం. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. న్యూ స్ట్రాటజీ పనుల్లో భాగంగా పండ్ల తోటలు, కొబ్బరి మొక్కల పెంపకానికి అవకాశం కల్పిస్తున్నాం.

– నాగ శేషవేణి, ఉపాధి ఏపీఓ, రంగంపేట మండలం

ఐదు అడుగులకు మించి వినాయక విగ్రహాలు పెట్టొద్దు


ఆరికరేవులలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై రవిచంద్రకుమార్

బిక్కవోలు: ఐదు అడుగులకు మించి వినాయక విగ్రహాలు పెట్టవద్దని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. సోమవారం ఆరికరేవుల గ్రామంలో సిద్ధి వినాయకుడు ఆలయం వద్ద గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రాబోయే వినాయక చవితి పురస్కరించుకుని ప్రశాంత వాతావరణంలో చవితి వేడుకలు నిర్వహించాలన్నారు. గతంలో జరిగిన అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏవిధంగా అశ్లీల ప్రోగాలు పెట్టకుండా కమిటీ సభ్యులు బాధ్యత తీసుకోవాలన్నారు. మైక్, కరెంటు నిబంధనలు ప్రకారం అనుమతులు తీసుకోవాలన్నారు. ఎటువంటి గొడవలు పెట్టుకోరాదు. పోలీసులకు సహకరించాలని అన్నారు. ఈ కార్యక్రమంలోని గ్రామస్తులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల బహిరంగ వేలం

రంగంపేట: ద్విచక్ర వాహనాలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్టు ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. సోమవారం సాయంత్రం ఆమె మాట్లాడుతూ రంగంపేట ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో పలు గ్రామాల్లో నిర్వహించిన దాడుల్లో స్వాధీన పరచుకొన్న మూడు ద్విచక్ర వాహనాలను ఈనెల 21వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు ఎక్సైజ్ స్టేషన్‌లో సంప్రదించాలని ఆమె తెలిపారు.

ప్రొటోకాల్ ఉల్లంఘనపై ఎంపీడీవోకు ఫిర్యాదు

- సర్పంచ్‌కు ఆహ్వానం ఇవ్వకుండా అవమానం
- తప్పుడు ఆరోపణలతో తప్పుదారి పట్టించే ప్రయత్నం


ఎంపీడీవోకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ ధనలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే సూర్యనారాయణరెడ్డి

అనపర్తి: స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జెండా వందన కార్యక్రమానికి గ్రామ ప్రథమ పౌరురాలైన తనను ఉద్దేశపూర్వకంగానే పిలవలేదని ప్రొటోకాల్ ఉల్లంఘించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాజీ శాసన సభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డితో కలసి ఎంపీడీవో రామకృష్ణారెడ్డికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్టు పొలమూరు సర్పంచ్ గుడాల ధనలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను బీసీ మహిళనే కాకుండా వైఎస్సార్ సీపీ సానుభూతిపరురాలుననే నెపంతో స్థానిక అధికారులు, ఎమ్మెల్యే తీవ్రంగా అవమానిస్తున్నారని సర్పంచ్ ధనలక్ష్మి ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ ఆగష్టు 15న స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జాతీయ జెండా ఆవిష్కరణ కార్యక్రమానికి ప్రొటోకాల్ ప్రకారం తనను ఆహ్వానించాల్సి ఉందని, కానీ ఉద్దేవపూర్వకంగా ఆహ్వానించకుండా అవమానించారన్నారు. అంతేకాక ఈ విషయమై తమ నేత మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి తనకు జరిగిన అవమానంపై స్పందిస్తే ఆహ్వానం ఇచ్చారని అసత్యాలు చెబుతున్నారన్నారు. మీలో ఏ కల్మషం లేకపోతే ఆ రోజు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి పాల్గొన్న అన్ని జెడా వందన కార్యక్రమాలు సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారని కాని ఒక్క పొలమూరులో జరిగింది మాత్రం ఎందుకు పోస్టు చేయలేదని ఆమె నిలదీశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అనపర్తి నియోజకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, పేద వర్గాల ఇళ్లు, షెడ్లే లక్ష్యంగా కూల్చివేతలు తమ దారికి రాని ప్రతిపక్ష ప్రజాప్రతినిధులను వేధించడం ఎక్కువైందన్నారు. తనకు జరిగిన అవమానంపై చర్యలు తీసుకోవాలని ఎంపీడీవోను కోరినట్టు ఆమె తెలిపారు. కార్యక్రమంలో పొలమూరు గ్రామ ఉపసర్పంచ్ సత్తి సూరారెడ్డి, ఎంపీటీసీ సత్తి కనకారెడ్డి, సర్పంచ్ భర్త గుడాల వెంకట్రావు, ఏఎంసీ మాజీ చైర్మన్ సబ్బెళ్ల కృష్ణారెడ్డి, రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, వైఎస్సార్ సీపీ అనపర్తి మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్వేను నిబంధనల ప్రకారం చేపట్టాలి


గంధ్రేడులో స్వామిత్వ సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: స్వామిత్వ సర్వేను అధికారులు నిబంధనల ప్రకారం చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. గంధ్రేడు, పైన, పుట్టకొండ గ్రామాల్లో సచివాలయం అధికారులు, సిబ్బంది, సర్వేయర్లు చేస్తున్న స్వామిత్వ సర్వే ప్రక్రియను ఆయన సోమవారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామిత్వ సర్వేతో గ్రామాల్లోని ప్రజల వ్యక్తిగత ఆస్తుల వివరాలతో పాటు ప్రభుత్వ రంగ ఆస్తులకు సరిహద్దులతో సహా భద్రత కలుగుతుందన్నారు. ప్రతి ఇంటితోపాటు రోడ్లు, చెరువులు, ఆలయాలు, అంగన్‌వాడీ, హెల్త్ సెంటర్లు, పంచాయతీ ఆస్తులు వంటివి సర్వే చేస్తున్నారన్నారు. సరైన దస్తావేజులు లేని కారణంగా తమ సొంత ఇళ్లపై బ్యాంకుల్లో ఆర్థిక లావాదేవీలు జరగని వారికి స్వామిత్వ కార్డుల ద్వారా రిజిస్ట్రేషన్ ప్రక్రియ చేసే అవకాశం ఉంటుందన్నారు. ప్రతి ఇంటికి కొలతల ప్రకారం పీపీఎం నంబర్లు డ్రోన్ సర్వే ద్వారా ప్రభుత్వం ఇప్పటికే ఇచ్చిందన్నారు. ఇది కేంద్ర ప్రభుత్వ సహకారంతో జరుగుతున్న సర్వే అన్నారు. కార్యక్రమంలో గంధ్రేడు సచివాలయం కార్యదర్శి తుమ్మల లక్ష్మీనారాయణ, డిజిటల్ అసిస్టెంట్ అజారుద్దీన్, ఇంజినీరింగ్ అసిస్టెంట్ ప్రియాంక, సర్వేయర్ సాయిశ్రీ, లలితా దేవి తదితరులు పాల్గొన్నారు.

పూర్వం సైగలతోనే భావాలు వ్యక్తం


మాట్లాడుతున్న వీసీ ఆచార్య ప్రసన్నశ్రీ

రాజానగరం: పూర్వకాలంలో మాట్లాడుకునేందుకు భాష లేని సమయంలో ఆదిమానవులు సైగలతోనే తమ భావాలను వ్యక్తపరిచేవారని ఆదికవి నన్నయ యూనివర్సిటీ వీసీ ఆచార్య ఎస్. ప్రసన్నశ్రీ అన్నారు. యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్‌లో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'సిగ్నల్ ప్రాసెసింగ్ ఇన్ రాడార్ కమ్యూనికేషన్' అనే అంశంపై సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో ఆమె పాల్గొన్నారు. ఈ విధంగా ప్రాచీన సిగ్నల్ వ్యవస్థ(సైగలతో భావాలను వ్యక్తపర్చడం) నుంచి నేటి ఆధునిక సిగ్నల్ రాడార్ వ్యవస్థ వరకు అభివృద్ధి చెందిన పరిణామ క్రమాన్ని వివరించారు. సిగ్నల్ ప్రాసెసింగ్ ప్రాముఖ్యం గురించి, మన దైనందిన జీవితంలో అది ఏవిధంగా ఉపయోగపడుతుందో ఉదాహరణలతో అవగాహన కలిగించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ పి.వెంకటేశ్వర్రావు, రీసోర్స్ పర్సన్స్ డాక్టర్ పి.కిషోర్‌కుమార్, బి.సుధాకిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక అర్జీ

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరం మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అధికారులు ఒక అర్జీని అందుకున్నారు. రఘుదేవపురంలో రాజమహేంద్రవరం - సీతానగరం ఆర్అండ్‌బీ రోడ్డు విస్తరణ పనుల్లో ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా, నోటీసులు ఇవ్వకుండా దౌర్జన్యంగా రోడ్డు విస్తరణ పనులు ఆర్అండ్‌బీ జేఈ వీరన్నబాబు చేపట్టారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని చినకొండేపూడికి చెందిన పెన్నాడ జానకీ రామయ్య అర్జీని అందించారు. వచ్చిన అర్జీని ఆర్ అండ్‌బీ ఈఈకు పంపించినట్టు ఎంపీడీఓ భారతి తెలిపారు.

కట్నం వేధింపులపై కేసు

సీతానగరం: చీపురుపల్లికి చెందిన తొర్లపాటి సంధ్యారాణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె భర్త జువ్వల రాజశేఖర్‌పై కట్నం వేధింపుల కేసు నమోదు చేశామని ఎస్సై డి.రామ్ కుమార్ సోమవారం తెలిపారు. నిడదవోలుకు చెందిన రాజశేఖర్‌తో 2023లో సంధ్యారాణికి వివాహమైంది. అనంతరం ఆమెను భర్త, అత్తమావలు కట్నం కోసం శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారు. దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది.

పీఏసీఎస్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం

పెదపూడి: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్)అభివృద్ధికి, రైతులకు అందుబాటులో ఉండి సేవలందించడానికి నిరంతరం కృషి చేస్తామని పెదపూడి పీఏసీఎస్, ఏపీత్రయం పీఏసీఎస్‌ల నూతన త్రీసభ్య కమిటీ చైర్మన్లు పుట్టా గంగాధర్ చౌదరి, కొలా సత్యనారాయణ అన్నారు. సోమవారం ఆయా పీఏసీఎస్‌లలో త్రిసభ్య కమిటీ చైర్మన్లు, సభ్యులు కాకర వీరవెంకట సత్యనారాయణ, అడపా రామలక్ష్మి, అమజాల వెంకన్న, కుంటెళ్ల బూరయ్య ప్రమాణ స్వీకారం చేశారు. ఆయా పీఏసీఎస్‌ల సీఈఓలు ఎం.దుర్గారావు, డి.వాసు వారితో ప్రమాణ స్వీకారం చేయించారు. వారికి సీఈఓలు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, ఎన్డీఏ నాయకులు, పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలియజేశారు.

యూరియా అందించాలని వినతి

సీతానగరం: రైతులకు యూరియా అవసరమని తక్షణమే అందించాలంటూ రఘుదేవపురం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ సభ్యులు మండల వ్యవసాయాధికారి గౌరీదేవికి వినతిపత్రం అందించారు. సోమవారం రఘుదేవపురం సొసైటీకి వచ్చిన ఏఓ గౌరిదేవికి త్రిసభ్య కమిటీ చైర్ పర్సన్ కవల గంగారావు ఆధ్వర్యంలో పర్సన్లు పెందుర్తి విజయ్ భాస్కర్, వాతాడ సత్తిబాబుతోపాటుగా పలువురు రైతులు వినతిపత్రం అందించారు. వారు మాట్లాడుతూ ఖరీఫ్‌లో యూరియా తక్కువగా వచ్చిందని, రైతులకు సరిపోలేదన్నారు. ఇప్పటి వరకు పీఏసీఎస్ ద్వారా రైతులకు 20 టన్నుల యూరియా అందించామన్నారు. ఇంకా 60 మెట్రిక్ టన్నులు అందించాల్సి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు గెద్దం రాంబాబు, పాలచర్ల పూసలబాబు, అడ్డాల చింతాలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం మరింత మెరుగుపర్చాలి


పెద్దాడలో చెత్త తొలగింపు పనులను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి

పెదపూడి: గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు మరింత మెరుగుపర్చాలని డిప్యూటీ ఎంపీడీఓ ఎం.సత్యనారాయణరెడ్డి అన్నారు. పెద్దాడ గ్రామంలో చెత్త తొలగింపు పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో రోడ్డుకు ఇరువైపులా, గ్రామ వీధుల్లోని చెత్త కుప్పలు, మురుగు గుంటలు తొలగించాలన్నారు. ఆయా ప్రాంతాల్లో బ్లీచింగ్ చల్లించాలన్నారు. ఎప్పటికప్పుడు మురుగు కాలువలు శుభ్రం చేయించాలన్నారు. వర్షాలు కురవడంతో గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున సచివాలయం అధికారులు, ఆరోగ్యశాఖ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. గ్రామాల్లో ప్రజలకు సీజనల్, అంటువ్యాధులు రాకుండా అవగాహన కల్పించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచి ఆరోగ్యవంతమైన ఏర్పాటుకు అందరూ సహకరించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో సచివాలయం కార్యదర్శి మన్యం శ్రీనివాసు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగతం



సీతానగరం: పాత కాలపు ఆచారాలు, సంప్రదాయాలు చాలా బాగుంటాయి. అయితే నేటి ఉరుకుల పరుగుల జీవితంలో వాటిని పాటించటానికి సమయం ఉండడం లేదు. కొందరైతే కొత్త పద్ధతులను పాటిస్తూ ముందుకు వెళుతున్నారు. ఈ నేపథ్యంలో రఘుదేవపురానికి చెందిన మామిడి వారి కుటుంబం పాత సంప్రదాయానికి పెద్ద పీట వేసింది. మామిడి రామకృష్ణ (రాంబాబు) కోడలు సృజన, మూడు నెలల మనవరాలు శ్రియానలను మొదటి సారిగా స్వగ్రామానికి ముత్యాల పల్లకీలో సోమవారం తీసుకువచ్చారు. గ్రామ ప్రజలందరూ ఈ ఊరేగింపును చూసి గత సంప్రదాయాన్ని గుర్తుకు తెచ్చుకున్నారు. మామిడి కుటుంబీకులను అభినందించారు.

బావి పూడ్చివేత


కూలిపోయి ప్రమాదభరితంగా మారిన బావి


కూలిపోయిన బావిని పూడ్చివేస్తున్న సర్పంచ్, పంచాయతీ అధికారులు

సాక్షి ఇంపాక్ట్

రంగంపేట: సుభద్రంపేట గ్రామ శివారు రోడ్డు పక్కన ఉన్న బావి ప్రమాదభరితంగా మారింది. సుభద్రంపేట నుంచి దొడ్డిగుంట, వెంకటాపురం గ్రామాలకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఈ బావి వర్షాలకు కూలిపోయింది. దీనిపై ఆదివారం సాక్షిలో 'ప్రమాదభరితంగా బావి' అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి గ్రామ సర్పంచ్, పంచాయతీ అధికారులు స్పందించారు. సోమవారం కూలిపోయి ప్రమాదంగా మారిన బావిని గ్రామ సర్పంచ్ కూటి సాయితాతారావు, పంచాయతీ కార్యదర్శి నెల్లిపూడి రాకేష్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారి సతీష్ ఆధ్వర్యంలో జేసీబీ సహాయంతో కూలిపోయిన బావిని పూడ్చివేశారు. అధికారులు వెంటనే స్పదించి ప్రమాదకర బావిని పూడ్చివేయడంతో గ్రామస్తులు, ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శివాలయానికి భూమిపూజ


రంగంపేటలో శివాలయం పునర్నిర్మాణ పూజలు చేస్తున్న పండితులు

రంగంపేట: స్థానిక మంచినీటి చెరువు వద్ద ఉమారామలింగేశ్వరస్వామి, బాల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వార్ల ఆలయ పునర్నిర్మాణ పనులకు సోమవారం భూమిపూజ చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఉండవల్లి జానకిరామ సుబ్బారావు(రాంబాబు) సుజాత, ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్రకుమార్, శ్రీకన్య దంపతులు వేకువ జామున మూడు గంటలకు పూజలు చేసి, శంకుస్థాపన కార్యక్రమం చేశారు. రాష్ట్ర దేవదాయ శాఖ నుంచి రూ.1.50 కోట్ల నిధులు మంజూరు కాగా, గ్రామస్తులు, భక్తుల సహకారంతో మరో రూ.1.50కోట్లతో ఆలయ నిర్మాణ పనులు ప్రారంభించినట్లు ఆలయ అర్చకులు మైలవరపు నాగేంద్రకుమార్ చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ బలిరెడ్డి దుర్గారావు, మాజీ ఉప సర్పంచ్ పోతుల వీరన్న, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన


సీతానగరం సొసైటీ వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

సీతానగరం: యూరియా పూర్తి స్థాయిలో అందించాలని కోరుతూ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. సోమవారం సీతానగరం, చినకొండేపూడి సహకార సంఘాలకు ఒక లారీలో కేవలం పది టన్నులు యూరియా మాత్రమే వచ్చింది. ఆ యూరియాను రెండు సంఘాలు పంచుకుని రైతులకు అందించడానికి సిద్ధం చేశారు. రైతులు ఆధార్ కార్డు చూపితే ఒక బస్తా యూరియా ఇస్తున్నారు. పది ఎకరాలు కౌలుకు చేసే కౌలు రైతులకు ఒక బస్తా యూరియా ఏం సరిపోతుంది. ఒక బస్తాతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. కొరత లేదని వ్యవసాయశాఖాధికారులు రైతులను మభ్యపెడుతున్నారని, పలు పంటలకు ఎరువులు అత్యవసరమని, ఎప్పుడు లేని కొరత ఇప్పుడు చూపిస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎరువుల కొరత తీర్చాలని డిమాండ్ చేస్తున్నారు.

రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు

బిక్కవోలు: రోడ్డుపై వాహనాలు నిలిపి ట్రాఫిక్‌కు సమస్య మారితే ఆ వాహనాలు యాజమానులపై చర్యలు తప్పవని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ అన్నారు. సోమవారం ఆయన పందలపాక గ్రామంలోని జెండా సెంటర్ వద్ద తరచూ రోడ్డుపై వాహనాలు నిలుపుతున్నారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. దీనివల్ల ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే షాపుల ముందు వాహనాలు పెట్టకుండా వ్యాపారులు జాగ్రత్త వహించాలన్నారు. ఎవరైనా నిబంధనలు వ్యతిరేకిస్తే వారిపై చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.